www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 02 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08



# బడా బిల్డర్ బరితెగింపు !

## కుంటను మింగిన రుద్ర !!

### రుద్ర మజాకా..?

### గంగన్నకుంటలోకి డ్రైనేజ మళ్లింపు

### అప్రోచ్ లేకున్నా అనుమతులెలా ?

### హెచ్ఎండీఏ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువ..



మేడ్చల్, అక్షిత బ్యూరో: కుంటను "రుద్ర" మింగింది. బడా బిల్డర్ బరి తెగించింది. కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను బడా సంస్థలు మింగేస్తున్నా పట్టించుకోవట్లే. కుంట స్థలాన్ని కబ్జా చేసేలా.. అప్రోచ్ రోడ్డు లేకున్నా.. హెచ్ఎండీఏ కళ్లు మూసుకుని అనుమతు లిచ్చేసింది. దొమ్మరపోచంపల్లిలో రుద్ర బిల్డర్ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. సీఎం పేషీ పేరు చెబితే చాలు అధికారులు సలాం కొడుతున్నారా? అనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అప్రోచ్ లేని వెంచర్ కు అనుమతుల మాయ.పక్క వెంచర్ సేఫ్టీ ట్యాంక్ స్థలంలో గేటు మాయ. డ్రైనేజీని కుంటలోకి మళ్లించడం. ఇలా అన్నింటా రుద్రకు హెచ్ఎండీఏ అధికారులు అమ్ముడు పోయిన పరిస్థితి. దొమ్మరపోచంపల్లిలో బడా బిల్డర్ ఆడుతున్న ఈ మాయాజాలం వెనుక హెచ్ఎండీఏ అధికారుల హస్తం ఉంది. సైబరాబాద్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జూన్ దుండిగల్ సర్కిల్ పరిధి దొమ్మర పోచంపల్లిలో నిర్మిస్తున్న రుద్ర నిర్మాణ సంస్థ చేపడుతున్న రాయల్ విలేజ్-2 వెంచర్ లో అడుగడునా, చిక్కుముడులు ఎదురవు తున్నాయి. అక్రమాలే ప్రైవేట్ వెంచర్ 40 ఫీట్ రోడ్డు చూపుతూ హెచ్ఎండీఏ అనుమతులు పొందిన నిర్మాణ సంస్థ ఆర్ఆర్ వెంచర్ లోని 600 గజాల సేఫ్టీక్ ట్యాంక్ స్థలాన్ని ఆక్రమిస్తూ భారీ ఎత్తున ముఖద్వారం,సిసి రోడ్డు నిర్మాణానికి తెరలేపింది. అక్కడితో ఆగని సదరు నిర్మాణ సంస్థ ముఖద్వారం ఎదురాగా ఉన్న ఆర్ఆర్ వెంచర్ సేఫ్టీక్ ట్యాంక్ డ్రైనేజి పైప్ లైన్ ద్వారా సమీపంలోని గంగన్న కుంటకు మళ్లించేందుకు ప్రయత్నిం చడం వివాదాస్పదంగా మారింది. లక్ష్మీ గణపతి వెంచర్ వాసులు అడ్డుకోవడంతో డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణానికి బ్రేక్ పడినట్లు సమాచారం. రుద్ర నిర్మాణ సంస్థ తీరుతో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారాలు తలలు పట్టుకుంటున్నారు. సీఎం పేషీలో ఉండే ఓ ఉన్నతాధికారి ..మిగతా 2లో

# వేప చెట్టే ఆమె ఇల్లు !

## ఆస్తి ఉన్నా.. అనాథ

### చెట్టు నీడలోనే 63 ఏళ్ల వృద్ధురాలి జీవనం

### ఆస్తి ఉన్నా.. అన్నం పెట్టే ఆపన్న హస్తం కరువు

### నిలువ నీడకై గోవిందమ్మ చూపు



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** ఆరు పదుల వయస్సు నిండింది. వేప చెట్టే ఆమె ఇల్లు. ఎండకు ఎండి...వానకు తడిసి... చెట్టు నీడ ఎటోస్తే అక్కడ ఆమె మంచం. ఆరు బయటే ఆమె జీవితం.కాలకృత్యాలు అక్కడే. అన్నీ ఉన్నా... చేరదీసే వారు కరువు. ఆస్తులున్నా ఆదరించే వారు లేరు. తోబుట్టువులు

నలుగురున్నా ఆలనా పాలన కరువైంది. మానవత్వం మంట గలిచింది. రెండెకరాల భూమి సుమారు రూ.50 లక్షల విలువైన భూమి ఉన్నా ఆత్మీయుల ఆదరణ సంరక్షణకు నోచుకోవడం లేదు. వయసు పైబడిన వేళ తోడుగా నిలవాల్సిన బంధువులు దూరమైతే.. ఆపదలో ఆదుకోవాల్సిన ఆపన్న హస్తం కరువైతే.. మనిషి జీవితం ఎంత దుర్భరంగా మారుతుందో బండమీదిపల్లిలోని 63 ఏళ్ల కురువతిక్క అనంతమ్మ అలియాస్ గోవిందమ్మ పరిస్థితి కళ్లకు కడుతోంది. సొంత ఇల్లు లేకపోయినా, కనీసం నాలుగు గోడల మధ్య తలదాచుకునే అవకాశం కూడా లేక.. ఓ వేపచెట్టు నీడలో, ఆరు బయట ఆమె జీవితం కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలోని బండమీదిపల్లికి ..మిగతా 2లో

# వయో వృద్ధులకు ఆసరా !

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్షిత బ్యూరో: వయో వృద్ధుల హక్కులు, ఆత్మగౌరవం, ఆరోగ్య భద్రతతో పాటు వారి సంక్షేమానికి జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ వ్యవస్థలు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ నిర్మాణంలో, ..మిగతా 2లో



# కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన

### 21 కుటుంబాలకు నాబార్డు చేయూత

### కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి

### చిన్నా లక్ష్మాపూర్ వాటర్‌షెడ్ కమిటీ ఆధ్వర్యంలో కోళ్ల పంపిణి, నైట్ షెల్టర్ల ఏర్పాటు

యాదాద్రి భువనగిరి, అక్షిత ప్రతినిధి: కోళ్ల పెంపకం 21 కుటుంబాలకు జీవనాధారమైంది. ఆర్థిక పరిపుష్టికి జీవం పోసింది.తుర్కపల్లి మండలం చిన్లక్ష్మాపూర్ గ్రామంలో నాబార్డు ఆర్థిక సహకారంతో ..మిగతా 2లో



www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY


## వేప చెట్టే ఆమె ఇల్లు !



**మొదటి పేజీ తరువాయి...**

చెందిన కురువతిక్క గోవిందమ్మ వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. వినికిడి, మాట సమస్యలతో పాటు నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు ప్రస్తుతం ఇతరుల సహాయం తప్పనిసరిగా మారింది. అయితే తనను చూసుకునే వారు లేక చెట్టు కిందే జీవనం సాగిస్తున్న పరిస్థితి స్థానికులను కలచి వేస్తోంది.స్థానికుల కథనం ప్రకారం.. గోవిందమ్మకు నలుగురు సోదరులు కురువ బింగి హనుమంతు, సొంటి హనుమంతు, నత్తి హనుమంతు, భక్తి హనుమంతులు ఉన్నప్పటికీ, ఆమెను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్ ఇంటి ఎదురుగా ఉన్న వేపచెట్టు కింద ఆమెను ఉంచినట్లు చెబుతున్నారు. ఇటీవల ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను కూడా తీసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గోవిందమ్మకు సుమారు రెండు ఎకరాల భూమి ఉందని, దాని విలువ ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో రూ.50 లక్షల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆస్తి విషయంలోనే ఆమెను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి

ఆస్తి కంటే.. ఆప్యాయత కావాలి. వృద్ధాప్యంలో ఆస్తులు, డబ్బు కంటే రెండు పూటలా అన్నం పెట్టే చేయి, అనారోగ్య సమయంలో మందులు అందించే మనసు, తలదాచు కునేందుకు ఓ చిన్న చోటు ఎంతో విలువైనవి. గోవిందమ్మకు ఆస్తి ఉన్నా.. ప్రస్తుతం ఆమెకు అవసరమైన కనీస మానవీయ ఆదరణ, సంరక్షణ లేకపోవడం విషాదకరంగా మారింది.

అనారోగ్యంతో,బాధపడుతున్న గోవిందమ్మకు తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించడంతో పాటు సురక్షితమైన ఆశ్రయం కల్పించాలని,కాలనీవాసులు కోరుతున్నారు. ఆమె సంక్షేమాన్ని అధికారులు స్వయంగా పరిశీలించి, వృద్ధాప్య పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవసరమైన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన



**మొదటి పేజీ తరువాయి...**

చిన్నలక్ష్మాపూర్ వాటర్‌షెడ్ పరిధిలోని చిన్నలక్ష్మాపూర్ పొట్టిమర్రి తండా గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేశారు. చిన్నలక్ష్మాపూర్ వాటర్‌షెడ్ కమిటీ ఆధ్వర్యంలో, మారీ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, వాటర్‌షెడ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కోళ్ల పెంపకం ద్వారా లబ్ధిదారులు అదనపు ఆదాయం పొందడంతో పాటు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. కోళ్ల పెంపకానికి అనువుగా నైట్ షెల్టర్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ అధ్యక్షుడు దూబాల నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు దూబాల రాంరెడ్డి, మేడిపల్లి రాజు మహేందర్‌రెడ్డి దుబాల, గోపనబోయిన ఐలమ్మ, గోపనబోయిన కొమురయ్య, నరిగె లక్ష్మి, బాలమ్మ, రమావత్ సరిత, దిరావత్ జగన్ మూడవత్ చిన్నా, వార్డు సభ్యులు నరేష్ అలాగే మారీ సంస్థ ప్రాజెక్టు అధికారులు వెంకట్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బడా బిల్డర్ బరితెగింపు !

**మొదటి పేజీ తరువాయి...**

అండతో అడ్డు వచ్చిన అధికారులను మ్యానేజ్ చేస్తున్న సదరు నిర్మాణ సంస్థ అక్రమాలకు తెరలేపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయల్ విలేజ్-2 వెంచర్ కు చుట్టూ 40 ఫీట్ రోడ్డు లేకపోవడం, ఓ ప్రైవేట్ వెంచర్ రోడ్డును చూపుతూ హెచ్ఎండీఏ అనుమతులు పొందడం పలు వివాదాలకు తావిస్తుంది. హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతులు జారీ చేస్తుండడంతో హెచ్ఎండీఏ అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.




### అప్రోచ్ రోడ్డు లేకుండా అనుమతులెలా?

సారేగుడెం సర్వే నంబర్. 294/పి, 295/పి,296/పి మరియు 620/పి లో రుద్ర నిర్మాణ సంస్థ 7.29 ఎకరాల్లో 99 విల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వెంచర్ చుట్టూ అప్రోచ్ రోడ్డు లేకపోవడం తో ఆర్ఆర్ వెంచర్ లోని 40 ఫీట్ రోడ్డును అప్రోచ్ రోడ్డుగా చూపుతూ అనుమతులు పొందడం విమర్శలకు తావిస్తుంది.



అనుమతులు ఇచ్చే ముందు హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోకుండా అనుమతులు మంజూరు చేయడం చూస్తుంటే రుద్ర నిర్మాణ సంస్థ నుండి హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారాలు భారీ ఎత్తున ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై హెచ్ఎండీఏ కమీషనర్ సమగ్ర విచారణ జరిపి అప్రోచ్ రోడ్డు లేకుండా అనుమతులు మంజూరు చేసిన హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని రుద్ర నిర్మాణ సంస్థ అనుమతులు రద్దు చేసి ప్రభుత్వ భూములు కుంటలను పరిరక్షించాల్సి ఉంది.

### మున్సిపల్ ప్రాపర్టీపై ఎంఓయూ సాధ్యమా..?

ఆర్ఆర్ దేవలప్పర్స్ విశ్వాసాయి టౌన్ షిప్ పేరుతో 2015 న గ్రామ పంచాయితీ అనుమతులు పొందింది,చట్టవిరుద్ధంగా అనుమతులు మంజూరు చేయడంతో నిర్మాణ సంస్థ చేపట్టిన అక్రమ నిర్మాణాలను అప్పటి ఈఓపీఆర్డి జ్యోతి రెడ్డి, హెచ్ఎండీఏ అధికారులు అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేయడంతో అప్పట్లో పెద్ద ఎత్తున దుమారం లేసింది. తదనంతర జరిగిన పరిణామాల్లో లేఅవుట్ రివైజ్డ్ అప్రూవల్ కోసం ప్రయత్నించిన ఆర్ ఆర్ దేవలప్పర్స్ నిర్మాణ సంస్థ నిబంధనల ప్రకారం 10 శాతం ఓపెన్ స్పేస్ ను ప్రజాప్రయోజనాల కోసం వదిలి 2022 నవంబర్ 29న డాక్యుమెంట్ నంబర్ 32001/22 పేరుతో సర్వే నంబర్,615(పి),616,617,618,619(పి), 620(పి), 621(పి)లోని 9404.47 చదరపు గజాల స్థలాన్ని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ పేరున గిఫ్ట్ డిడ్ చేసింది. గిఫ్ట్ డిడ్ చేసిన స్థలం విశ్వాసాయి టౌన్ షిప్ ప్లాట్ ఓనర్స్ కు రుద్ర కన్స్ట్రాక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య 2025 మే 24న ఏంఓయు ఒప్పందం కుదరడం వివాదాస్పదంగా మారింది.

# వయో వృద్ధులకు ఆసరా !

**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా అభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల పాత్ర ఎంతో ప్రాధాన్యమైనదని కొనియాడారు. కుటుంబం అంటే కేవలం రక్తసంబంధీకులే కాకుండా స్నేహ బంధాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. చిన్నతనం నుంచి చదువు, ఉద్యోగం, పెళ్లిళ్లు,పిల్లల పెంపకం వంటి బాధ్యతలన్నీ నెరవేర్చిన తర్వాత,విశ్రాంతి సమయంలో మళ్లీ ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు గురి కాకూడదన్నారు.మీ సంతోషం ఎక్కడ ఉందో గ్రహించి,అక్కడ సమయం గడపాలని,మన ఆలోచనలే మన సంతోషానికి మూలం, సమాజంలోని అందరినీ మన కుటుంబ సభ్యుల్లా భావించినప్పుడే మానసిక విశాలత పెరుగుతుందని పేర్కొన్నారు.వయోవృద్ధులు ప్రతిరోజూ ఒక స్పష్టమైన ప్రణాళికతో సమయం గడపాలని సూచించారు. ఉదయాన్నే నడక,వార్తా పత్రికలు,పుస్తకాలు చదవడం, దైవచింతన, స్నేహితులతో సరదాగా మాట్లాడడం వంటి అలవాట్లను పెంపొందించు కోవాలని పిలుపునిచ్చారు. కుటుంబ విషయాలపై కేవలం 10 శాతం మాత్రమే దృష్టి పెట్టి, మిగిలిన 90 శాతం సమయాన్ని మీ సొంత ఆలోచనలు, ఆరోగ్యం,ఆనందం కోసం కేటాయించాలని సూచించారు. ఉద్యోగులైన పిల్లలు తమ వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకునేందుకు "తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మ్యాండేటరీ పేరెంటల్ సపోర్ట్ యాక్ట్" అందుబాటులో ఉందని తెలిపారు. బాధిత తల్లిదండ్రులు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే,పిల్లల జీతం నుంచి నిర్దేశిత మెయింటెనెన్స్ మొత్తాన్ని కట్ చేసి నేరుగా తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ చేసే అధికారం కలెక్టర్‌కు ఉంటుందని స్పష్టం చేశారు.బీపీ,షుగర్ బాధితుడి సమాచారం పీహెచ్‌సీల వారీగా ప్రభుత్వం వద్ద నమోదై ఉందని, బాధితులకు క్రమం తప్పకుండా ఉచితంగా మందులు అందిస్తున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో నడుస్తున్న డే కేర్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ బి హరిసింగ్, డిఆర్డిఓ సన్యాసి డిడబ్ల్యు నరసింహ రావు, డిఎంహెచ్ఓ వెంకట రమణ, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్,యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధులు ఆనందంగా గడపాలి

**వయోవృద్ధుల అనుభవాలను భావితరాలకు అందించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, అక్షిత బ్యూరో:** వయోవృద్ధులు గతాన్ని తలచుకుని బాధపడకుండా, ఎలాంటి ఉద్రేకాలకు లోనుకాకుండా ప్రశాంతంగా వర్తమానాన్ని ఆనందంగా గడపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.

కుటుంబంలో, సమాజంలో ఓర్పుతో సర్దుబాటు అవుతూ తమ విలువైన అనుభవాలను భావితరాలకు అందించాలని కోరారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల అనుభవాలు ఎంతో కీలకమన్నారు.

జిల్లాలో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో విశ్రాంత విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకోవడం అభినందనీయమన్నారు. వయోవృద్ధుల అనుభవాలను పిల్లలతో పంచుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, భయం లేకుండా వేదికలపై మాట్లాడే సామర్థ్యం, ఆసక్తి పెరుగుతున్నాయని తెలిపారు.

వయోవృద్ధులు కృంగిపోకుండా ప్రశాంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, గతాన్ని గుర్తుచేసుకుని బాధపడకుండా ప్రస్తుతాన్ని సంతోషంగా ఆస్వాదించాలని సూచించారు.

కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, ఆర్డీవో నర్సంపేట ఉమారాణి, డీఏఓ ఫణికుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డి, పీడీ డీఆర్డీఏ నాగపద్మజ, జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు మల్లారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నదానం పుణ్యకార్యం

**మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి**




**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక రంగా థియేటర్ వద్ద నిర్వహిస్తున్న 15 రోజుల ఉచిత అన్నదాన కార్యక్రమం గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. కాగా ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వెంపాటి వెంకటేశ్వరరావు, కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ రోజు అన్నదాన కార్యక్రమానికి దాతలుగా స్వామి వెంకటేశ్వర్లు-కుమారి, స్వామి శ్రీనివాస్-ఉదయశ్రీ స్వామి లక్ష్మీనారాయణ, అనసూయమ్మల జ్ఞాపకార్థం, పొట్టుముత్తు విద్యాసాగర్-భారతి, పొట్టుముత్తు వినోదిని జ్ఞాపకార్థం, పొట్టుముత్తు నరేందర్-పద్మ, పొట్టుముత్తు కోటయ్య, లింగమ్మల మరియు ఇరుకుళ్ళ చెన్నకేశవరావు-రూపవతి ఇరుకుళ్ళ సీతారామాంజ నేయులు, దమయంతుల జ్ఞాపకార్థం ఆర్థిక సహకారం అందించారు. దాదాపు 200 మంది పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పితృ పక్షాల వేళ పేదల ఆకలి తీర్చడం గొప్ప సేవ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పైడిమర్రి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పందిరి సత్యనారాయణ, కోశాధికారి గాదంశెట్టి శ్రీనివాసరావు, గరినే ఉమా, శ్రీధర్, చల్లా ప్రకాష్, ఇరుకుల్లా చెన్నకేశవరావు, ఒరుగంటి కిట్టు, కొత్తూరు శ్రీను, శంకర్, సాయి, చీదెళ్ల హనుమంతరావు, వెంపటి ప్రసాద్, పైడిమర్రి రామారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు క్రిష్ణవేణి విద్యార్థులు

**ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ..**

**అండర్-14, అండర్-17 విభాగాల్లో ఏడుగురి ఎంపిక**



**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీల్లో క్రిష్ణవేణి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఎస్. ప్రణీత, వి. మానస, ఎం. శరణ్య, పి. అమరనాథ్, అండర్-17 విభాగంలో పి. నిషిత, ఎస్. అక్షిత, పి. నితిన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ అందించిన పీఈటీ కల్పనను కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.వి.ఎన్.ఎస్. మణి, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

## పబ్బు రాజు గౌడ్ ను పరామర్శించిన డి.ఎస్.పి,సీఐ



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజ్ గౌడ్ మాతృమూర్తి గత నెల స్వర్గస్తులయ్యారు. చౌటుప్పల్ డిఎస్పి పటోళ్ల మధుసూదన్ రెడ్డి , సీఐ జి మన్మథ కుమార్ లు గురువారం దండు మల్కాపురంలోని పబ్బురాజు గౌడ్ నివాసానికి వెళ్లి వారి మాతృమూర్తి పబ్బు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పబ్బు రాజు గౌడ్ ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## దేవుళ్లను వేరు చేసి మాట్లాడటం హిందూ ధర్మానికి ద్రోహమే

**సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బిజెవైఎం జిల్లా ఐటి సెల్ ఇంచార్జి మచ్చ వివాకర్ రెడ్డి ఆగ్రహం**

**హిందూ ధర్మం, సంస్కృతిని అవమానించవద్దని హితవు**

**ఎన్నికల సమయంలో దేవుళ్లను పూజించిన విషయాన్ని గుర్తు చేసిన నేత**



**యాదాద్రి భువనగిరి అక్షిత బ్యూరో:** హిందూ ధర్మం, సంస్కృతి, దేవుళ్లను విదేశీయులు సైతం ఆరాధిస్తున్నారని, అలాంటి ధర్మంలో దేవుళ్లను వేరు చేసి మాట్లాడటం సరికాదని బి జె వై ఎం జిల్లా ఐ టి సెల్ ఇంచార్జి మచ్చ వివాకర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యల పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం కోసం గతంలో వివిధ ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించిన సీఎం ఇప్పుడు హిందూ దేవుళ్లను వేరు చేసి మాట్లాడటం బాధాకరమన్నారు. చిన్నప్పటి నుంచి రాముడు, శివుడు, హనుమంతుడు, అమ్మ వారి ఆలయాలను దర్శించి, పుణ్యక్షేత్రాలకు వెళ్లిన విషయాన్ని సీఎం గుర్తు చేసుకోవాలని సూచించారు. అన్ని మతాలు, కులాలను సమానంగా గౌరవించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. హిందూ సమాజంలో విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని అయన కోరారు.

## హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో దిశా కమిటీ సమావేశం



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన ప్రారంభమైన దిశా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె.ఆర్ నాగరాజు , జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, సాగునీరు తదితర రంగాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలు, పురోగతిపై శాఖల వారీగా సమీక్షించరు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY


## దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్ :** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో పాపమ్మ గుడి నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయంను అందించి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం ఒకటో వార్డు కౌన్సిలర్ కోసనం రాకేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుర్వి నరసింహ గౌడ్ లు వారి చేతుల మీదుగా కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు.

## వార్డు కౌన్సిలర్ ఇంటికి పెద్దాయన



**హాలియా అక్షిత న్యూస్, అక్టోబర్ 1 2026:** నాగార్జునసాగర్ నియోజకవర్గ హాలియా మున్సిపాలిటీ ఐదో వ వార్డ్ కౌన్సిలర్ చిట్టిప్రోలు శ్రీదేవి కర్ణ సాగర్ వారి ఆహ్వానం మేరకు మాజీ మంత్రివర్యులు కుందూరు జానారెడ్డి వాళ్ళ గృహమునకురావడం జరిగింది. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో వజ్ర తేజ రైస్ ఇండస్ట్రీ చైర్మన్ చిట్టిపోలు యాదగిరి మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ చిట్టిపోలు వెంకటేశ్వర్లు రమేష్ చిట్టిప్రోలు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు

## మా అభ్యాసం మా గర్వం... మా ప్రతిభ మా భవిష్యత్తు!

### నారాయణ స్కూల్ సత్తుపల్లిలో ఘనంగా ప్రైమరీ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి )




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** నారాయణ స్కూల్ సత్తుపల్లిలో 1వ ,2వ తరగతి విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోచిన్నారులేవక్తలుగా, తల్లిదండ్రులే ప్రేక్షకులుగా పాల్గొని, విద్యార్థులు తమప్రతిభనుఎంతోఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు వేదికపై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్నఅంశాలనుతల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా వివరించి, వివిధ కార్యకలాపాలు మరియు ప్రదర్శనల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల చురుకుదనం,ఆత్మవిశ్వాసం, మాట్లాడేతీరుతల్లిదండ్రులనుఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఎంజిఎం రాంకీ హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించి, చిన్నారులను అభినందించారు. అలాగే ఆర్ఐ క్రాంతి,కోఆర్డినేటర్ వినోద లక్ష్మి గారు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానమే కాకుండా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను వ్యక్తపరచే అవకాశాలను కల్పించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి ఎస్ ఎల్ సి వంటి కార్యక్రమాలుదోహదపడుతున్నాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# పోలీసు అభ్యర్థులు ఉచిత శిక్షణ అవకాశాన్ని వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోనే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత శిక్షణ అవకాశాన్ని ఉద్యోగార్థులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పోలీసు అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసు అభ్యర్థులకు ఉచిత భోజనంతో పాటు శిక్షణ అందిస్తున్న జిల్లా ఎస్పీ, పోలీసులకు, సహకరిస్తున్నవారికి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాదు లాంటి దూర ప్రాంతానికి వెళ్ళి ఉద్యోగ శిక్షణ పొందడం ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయమని, జిల్లా కేంద్రంలోనే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న ఈ శిక్షణ ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ) కాలంలో ఉద్యోగం పొందడం కష్టంతో కూడుకున్న పని అని, ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంతో పోటీ ఉందని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సూచించారు. దూర ప్రాంతాల విద్యార్థులకు వసతి సౌకర్య కల్పనలో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.



### పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడాలి: జిల్లా ఎస్పీ జానకి షర్మిల

పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా ప్రతి ఒక్క అభ్యర్థి కష్టపడి చదువుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా అభ్యర్థులకు ఉచిత పోలీసు శిక్షణలో సహకరించినవారికి, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత పోలీసు శిక్షణకు దాదాపు 300 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారని అన్నారు. అభ్యర్థులకు ఒక పూట ఉచితంగా భోజనం, అల్పాహారం, అవసరమైన తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. సుదూర ప్రాంత విద్యార్థులకు అవసరమైన వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగ సన్నద్ధానికి అవసరమైన మెటీరియల్ సమకూర్చేలా చూస్తామన్నారు. ఉద్యోగార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించామని, అలాగే స్వయంగా బోధనా అనుభవం ఉన్న పోలీసు సిబ్బందిచే సైతం విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రెండ్రోజులకు ఒకసారి పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. దేహదారుఢ్య (ఫిజికల్ ఈవెంట్స్) పరీక్షలకు అవసరమైన శిక్షణ సైతం అందిస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా అందుబాటులో ఉన్న సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పి సాయి కిరణ్, డీఎస్పి శ్రీనివాస్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## టీపీసీసీ ఎస్సీ సెల్ క్యాతన్‌పల్లి పట్టణ అధ్యక్షుడిగా నక్క శ్రీనివాస్



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ క్యాతన్‌పల్లి పట్టణ అధ్యక్షుడిగా నక్క శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ సెల్ మంచిర్యాల జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ నియామక ఉత్తర్వులను ప్రకటించారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో, పార్లమెంట్ సభ్యుడు వంశీకృష్ణ నాయకత్వంలో, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి సూచనలతో, క్యాతన్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓడ్నాల శ్రీనివాస్ సహకారంతో నక్క శ్రీనివాస్‌ను ఈ బాధ్యతకు నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ మాట్లాడుతూ.. క్యాతన్‌పల్లి పట్టణంలోని ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి, వారి హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నక్క శ్రీనివాస్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎస్సీ వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేయడంతో పాటు, వారి సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. నూతన అధ్యక్షుడు నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో క్యాతన్‌పల్లి పట్టణంలో ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేస్తానని, ప్రజల సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు నక్క శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

## నిర్మల్ జిల్లా కేంద్రంలో కొత్తగా చెన్నై షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీనటి శ్రీలీల



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీ లీల మాట్లాడుతూ నిర్మల్ లో ది చెన్నై షాపింగ్ మాల్ ను ప్రారంభించడం ఒక కొత్త షాపింగ్ ప్రపంచంలో మరో ముందడుగు వేసిందని చెప్పొచ్చు అలాగే నిర్మల్ పరిసర ప్రాంతాల ప్రజలు యువతి యువకులు కోరుకుంటున్న అభిరుచిలకు తగ్గట్టుగా అలాగే వినియోగదారుల అభివృద్ధిలకు తగ్గ లక్షల డిజైన్లతో పాటు నిర్మల్ ప్రజల ముంగిట ది చెన్నై షాపింగ్ మాల్ నిలవడం జరిగిందని చెప్పారు. మరియు పండుగలు వివాహాలు శుభకార్యాలు ప్రత్యేక సందర్భాలలో తో పాటు నిత్యం ప్రతిరోజు వాడుకునేటట్లు అవసరమైన వస్త్రాలు ఈ ది చెన్నై షాపింగ్ మాల్ లో ఒకే చోట ఎంపిక చేసుకునే విధంగా ఇక్కడ దొరుకుతాయని శ్రీ లీల తెలియజేయడం జరిగింది. అలాగే ఇక్కడ ఫ్యాషన్ దుస్తులతో పాటు సాంప్రదాయ కుటుంబ అవసరాలకు తగ్గట్టుగా విభిన్న ఉత్పత్తులను చెన్నై షాపింగ్ మాల్ తీసుకురావడం అనేది విశేషమని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది . అయితే ఇది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన శ్రీ లీల సినీనటి రావడంతో ఒక్కసారిగా అక్కడ సందడి తోపాటు ఆనంద ఉత్సవాలకు హద్దులు లేకుండా పోయింది. అక్కడి జనం నటి శ్రీ లీలను ఆనందోత్సవాలతో స్వాగతం పలికినంత స్వామి వ్యక్తం చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి ప్రముఖులు ఆదిలాబాద్ జిల్లా ఎంపీ గోదా నగేష్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మర్రి రిటైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మర్రి వెంకట్ రెడ్డి డైరెక్టర్ కృష్ణారావు నిర్మల్ నియోజకవర్గం ఇన్చార్జి శ్రీహరి రావు మున్సిపల్ చైర్మన్ ఉప్పల కావ్య గణేష్ చక్రవర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి 40 వ వార్డు కౌన్సిలర్ ఆడాప విజయలక్ష్మి మరియు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నగర ప్రముఖులు అతిథులు ఈ వేడుకలకు పాల్గొనడం జరిగింది.

# అంతమ్మగూడెం,దోతిగూడెం కెమికల్ పరిశ్రమలను మూసివేయాలి..

## పరిశ్రమలతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి...

## ఆర్టీవోకి వినతి పత్రం అందజేసిన సిపిఎం నాయకులు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహాంగీర్

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** పోచంపల్లి మండలం పరిధిలోని అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో కొనసాగుతున్న కెమికల్ పరిశ్రమల వల్ల స్థానిక ప్రజలు, రైతాంగం తీవ్ర నష్టాన్ని , అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆ పరిశ్రమలను ప్రభుత్వం వెంటనే మూసివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహాంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెమికల్ పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణం నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని సూచించారు.

గురువారం పోచంపల్లి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో ఉన్న కెమికల్ పరిశ్రమలను



ఎత్తివేయాలని, పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలల నుండి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు 11 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించుకుంటూ ఆర్డిఓ కార్యాలయం ముందు మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్యఅతిథిలు గా జహాంగీర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ లు పాల్గొని మాట్లాడుతూ...ఈ కెమికల్ పరిశ్రమల నుండి వెలువడుతున్న విషపూరిత రసాయనాలు, పొగ, వ్యర్థాల కారణంగా వాయు, నీటి కాలుష్యం కోరలు చాచిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం వల్ల వ్యవసాయ భూములు, పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పంట పరిహారం చెల్లించాలన్నారు.

పరిశ్రమల వల్ల కలుషితమైన నీటి వనరులను శాస్త్రీయంగా పరీక్షించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని గుర్తించేందుకు సమగ్ర ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. పరిశ్రమల నుండి వెలువడే పొల్యూషన్ అంచనా వేయడానికి పొల్యూషన్ తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమానికి సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శివర్గ సభ్యులు సిపిఎం ప్రసాదం విష్ణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, చౌటుప్పల పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గడ్డం వెంకటేష్, రాయగీర్ కిష్టయ్య, సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శివర్గ సభ్యులు పగిల్ల లింగారెడ్డి, మంచాల మధు చౌటుప్పల్ మండలం కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి చింతల సుదర్శన్, సీపీఎం నాయకులు బండారు నరసింహ, ఆదిమూలం నందీశ్వర్ పొట్ట శ్రీనివాస్ బోధస్ వెంకటేష్ కొండే శ్రీశైలం కొంతం సుశీల శ్రీనివాస్ రెడ్డి కాసం వెంకటేశం నేరేడు మహేష్, చీరిక అలివేలు, బత్తుల దాసు, పకీరు పెంటా రెడ్డి, పకీరు లక్ష్మమ్మ,చెరుకు సత్తయ్య, అంజయ్య, , సామ జంగారెడ్డి, కల్కూరి బిక్షపతి, నెల్లికంటి జంగయ్య, వడ్డేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, రైతులు జి. దామోదర్ రెడ్డి, కే మహేష్, ఆర్ రామిరెడ్డి, ఆర్ ధనలక్ష్మి, వీ రేణుక, జి. రామచంద్రారెడ్డి, ఎం సత్తయ్య, సత్యం, అర్జున్ రెడ్డి, జి మల్లేష్, బి బిక్షపతి, మల్లారెడ్డి, ఎల్లమ్మ, రాకేష్, శ్రీశైలం,గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## రామగుండం సిపి అంబర్ కిశోర్ ఝా

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** మందమర్రి పారిశ్రామిక ప్రాంతంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం మందమర్రి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, రిసెప్షన్ కేంద్రం, సీసీటీఎన్ఎస్ వివరాల నమోదు, సిబ్బంది బ్యారక్‌లను పరిశీలించారు. స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, 5ఎస్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. అన్ని రికార్డులను క్రమబద్ధంగా





నిర్వహించాలని, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, నేర నియంత్రణ చర్యలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌పై ఎస్ఐ నరేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మందమర్రి సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడ ప్రత్యేక సవాళ్లు ఉన్నాయని సీపీ పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరాన్ని బట్టి నిబంధనల ప్రకారం గ్యాంగ్ ఫైళ్లను ప్రారంభించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మందమర్రిని నేరాలు, మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, మెరుగైన పోలీసు సేవలు అందించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. తనిఖీ సందర్భంగా మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మందమర్రి ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ వైద్య విద్యకు - ఉప్పల వెంకటేష్ ఆర్థిక భరోసా



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సౌమ్య తండ్రి శ్రీశైలం వైద్య విద్యలో గ్రామీణ ప్రాంతాలలో పుట్టి పెరిగి వైద్య విద్యలో సీటు సాధించడంతో సౌమ్యను అభినందించిన ఉప్పల వెంకటేష్..సౌమ్య వైద్య విద్య ఖర్చుల కోసం 10,000/- వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి వైద్య విద్య పై పూర్తి సహకారం అందిస్తానని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ వట్టేపు బాలయ్య,మాజీ మండల కో ఆప్షన్ రుక్కుద్దీన్, హాజిలాపూర్ సర్పంచ్ సిద్ధగొని రమేష్ గౌడ్,మాజీ ఉప సర్పంచ్ కర్ణాకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్ళ సురేష్ గౌడ్, వర్కాల దేవయ్య,మాణిక్య రావు,వాటం రవి, ఉప్పల వెంకటేష్ సైన్యం వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోస్ ద్వారా ప్రపంచ పటంలో దేవరకద్ర నియోజవర్గం

## దేశం గర్వపడే బ్రహ్మోస్ ను సాధించిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ధన్యవాదాలు



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** దేశం గర్వపడే "బ్రహ్మోస్" ను దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గంలో సాధించి దేవరకద్ర నియోజకవర్గం రూపురేఖలు మార్చి ప్రపంచ పటంలో చేర్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు శ్రీ శ్రీ కురుమూర్తి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా బాదం మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంకు సమీపంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా "క్షిపనిలు తయారుచేసే బ్రహ్మోస్" సాధించి దేవరకద్ర ఎమ్మెల్యే నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయారని బాదం కొనియాడారు. బ్రహ్మోస్ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ఈ ప్రాంత యువతకు తరతరాలుగా తలరాత మార్చే విధంగా ఈ పథకం తేవడంలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కృషి అభినందనీయమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. బ్రహ్మోస్ పథకం మంజూరులో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాత్ర అపారమైనదని.. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్ట్ ప్రవేశపెట్టడానికి ప్రత్యేక జీవో తీసుకువచ్చిన రూపకల్పన రూపశిల్పి మన జిఎంఆర్ ని అదే మాదిరిగా కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం త్వరలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో రాబోవుచున్నదని గుర్తు చేస్తూ..దీనికి తోడు ఊకచెట్టు వాగు పై బ్రిడ్జికి నిధులు మంజూరు చేసి దాన్ని ప్రారంభించడం పట్ల ఈ ప్రాంత ప్రజలు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి రుణపడి ఉన్నారని ఆయన చెప్పారు. దీంతోపాటు దాదాపుగా 40 సంవత్సరాలుగా సమస్యగా ఉన్న కొత్తకోట "సంత స్థలమును" కేటాయించి.. పురాతన కాలం నాటి చనిగే చెరువును ఆధునికరించి శ్రీ వెంకటగిరి ఆలయానికి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తాను ఏందో నిరూపించుకుని సత్తా చాటారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



**జగిత్యాల అక్షితబ్యూరో:** శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని బిపోలీస్ యాక్ట్ 1861బి ప్రకారం నెల రోజుల (అక్టోబర్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించ వద్దని, నిబంధనలకు విరుద్ధంగా డి.జె వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## వ్యక్తిత్వ వికాసమే అన్ని రంగాల అభివృద్ధికి మూలం

### వరంగల్ సిపి ఎన్. శ్వేత



**వరంగల్, అక్షిత బ్యూరో:** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యక్తిత్వ వికాసమే విద్య, ఉద్యోగం, సామాజిక సేవతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, తెలిపారు. గురువారం పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ దిశానిర్దేశక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ, ఎన్.ఎస్.ఎస్ ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ, సమాజానికి ఉపయోగపడే చీరా వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయిలు విడుదల చేయించండి





**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** విద్యార్థుల ఉన్నత చదువుల కోసం, కళాశాల భవిష్యత్తు కోసం బకాయి పడ్డ రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ లు సకాలంలో విడుదల చేసే విధంగా ప్రభుత్వాన్ని కోరాలని మాజీ హోం మంత్రి కుందూరు జానారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డిలకు వినతిపత్రాలు విజేత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ, వైస్ ప్రిన్సిపాల్ మధులు సమర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధు, యాదయ్య, హరి ఉన్నారు.



# మందమర్రి ఏరియాలో 130 శాతం బొగ్గు ఉత్పత్తి

### 105 శాతం ఓబీ తొలగింపు.. త్వరలో రామకృష్ణాపూర్ ఓసీపీ ప్రారంభం

### సురక్షిత బ్లాస్టింగ్‌కే ప్రాధాన్యం: జీఎం ఎన్. రాధాకృష్ణ

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** సింగరేణి మందమర్రి ఏరియా సెప్టెంబర్ మాసంలో నిర్దేశిత లక్ష్యానికి మించి 130 శాతం బొగ్గు ఉత్పత్తి, 105 శాతం ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపు సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. గురువారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన సెప్టెంబర్ మాసానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత, కార్మిక సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. భూగర్భ గనుల్లో ఉద్యోగుల గైర్హాజరు కారణంగా ఉత్పత్తికి కొంత విఘాతం కలుగుతోందని, ఈ సమస్యను అధిగమించేందుకు యూనియన్ నాయకులతో సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో 100 శాతం ఉత్పత్తి సాధించే దిశగా అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సురక్షిత బ్లాస్టింగ్‌కు ప్రాధాన్యం**

గని కార్మికుల ప్రాణరక్షణే సింగరేణి యాజమాన్యానికి ప్రథమ కర్తవ్యమని జీఎం పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో పేలుడు పదార్థాల పరిమాణం, డిలే డెటోనేటర్ల సమయాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రౌండ్ వైబ్రేషన్, శబ్దం సురక్షిత పరిమితుల్లో ఉండేలా మైనింగ్ ఇంజనీర్లు బ్లాస్టింగ్ డిజైన్ చేస్తున్నారని వివరించారు. పేలుడు సమయంలో రాళ్లు, మట్టి ముక్కలు ఎగిరిపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఫ్లై రాక్స్ పరిధిని గరిష్ఠంగా 300 మీటర్లలోపు పరిమితం చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అండర్‌గ్రౌండ్, ఓపెన్ కాస్ట్ గనుల్లో అమలు చేస్తున్న బ్లాస్టింగ్ విధానాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విలేకరులకు వివరించారు.



MMR AREA Press Meet for Sep-2026

| Mine | 2026-27 Target | MONTH (Sep-26) Target | MONTH (Sep-26) Dispatches | MONTH (Sep-26) % Achv | YEAR (upto Sep-26) Target | YEAR (upto Sep-26) Dispatches | YEAR (upto Sep-26) % Achv | TARGET Oct-26 |
|---|---|---|---|---|---|---|---|---|
| SK | 120000 | 10000 | 604 | 6 | 60000 | 4450 | 7 | 10000 |
| KK 5 INC | 220000 | 17000 | 17614 | 104 | 100500 | 106400 | 106 | 20000 |
| KASIPET | 240000 | 20500 | 11385 | 56 | 121000 | 70157 | 58 | 19000 |
| KASIPET2 | 200000 | 17000 | 9492 | 56 | 100000 | 62046 | 62 | 16000 |
| UG MINES | 780000 | 64500 | 39095 | 61 | 381500 | 243053 | 64 | 65000 |
| KK OC | 1704000 | 110000 | 187948 | 171 | 790000 | 1036176 | 131 | 134000 |
| TOTAL | 2484000 | 174500 | 227043 | 130 | 1171500 | 1279229 | 109 | 199000 |
| 2025-26 | | 204500 | 115184 | 56 | 1281500 | 768486 | 60 | |
| OB LBCM | 261.06 | 15.30 | 16.00 | 105 | 110.85 | 112.63 | 102 | 24.85 |
| 2025-26 (OB LBCM) | | 6.00 | 0.50 | 8 | 80.00 | 18.68 | 23 | |

| Rainfall Data | 2026 | 2025 |
|---|---|---|
| Month | 202 | 573 |
| Year | 1323 | 1589 |

| Rainy Days | 2026 | 2025 |
|---|---|---|
| Month | 15 | 20 |
| Year | 74 | 82 |

| MODE WISE DISPATCHES | MONTH (Sep-26) RAIL | MONTH (Sep-26) ROAD | MONTH (Sep-26) CHPS | MONTH (Sep-26) TOTAL | MONTH (Sep-26) RAKES | YEAR (upto Sep-26) RAIL | YEAR (upto Sep-26) ROAD | YEAR (upto Sep-26) CHPS | YEAR (upto Sep-26) TOTAL | YEAR (upto Sep-26) RAKES |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 198190 | 15137 | 8112 | 221439 | 51 | 1141470 | 74564 | 54879 | 1270913 | 293 |
| | 213327 | | | | | 1216034 | | | | |

**మహిళలు, యువతకు శిక్షణ**

ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమానికి కూడా సింగరేణి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని జీఎం తెలిపారు. ఈ ఏడాది మహిళలు, యువతీ యువకులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ తరగతులను ఈ నెలలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

**త్వరలో రామకృష్ణాపూర్ ఓసీపీ**

ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ)ను అతి త్వరలో ప్రారంభించనున్నట్లు జీఎం తెలిపారు. రక్షణ, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తిని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి నెలా వెల్ఫేర్ అధికారులు, పర్సనల్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేకే ఏజెంట్ ఖాదిర్, కేకేఓసీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, ఏరియా ఇంజనీర్ ఈఅండ్ఎం బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ సీహెచ్. అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్‌కుమార్, సీనియర్ పీవో కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పైపులైన్ కోసం తవ్వి.. రోడ్డును మరిచిపోయారు!

### ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

### రెండు నెలలుగా రోడ్డు దుస్థితి.. విద్యార్థులు, వాహనదారులు సహా స్థానికుల అవస్థలు

**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, అక్టోబర్ 1:** పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో రాఘవేంద్ర కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, రెడ్డీస్ శ్మశానవాటిక వెనుక వైపు చిలకానగర్ రోడ్డులో, శ్రీనగర్ కాలనీ స్ట్రీట్ నంబర్--8 చివరన నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా ఈ సమస్య నెలకొంది. సుమారు రెండు నెలల క్రితం పైపులైన్ ఏర్పాటు కోసం జీహెచ్ఎంసీ అధికారులు సుమారు 50 మీటర్ల మేర రోడ్డును తవ్వారు. అయితే స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో పనులను మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి తవ్విన రోడ్డును అలాగే వదిలేయడంతో మట్టి, గుంతలు, బయటకు వచ్చిన రాళ్లతో రహదారి అధ్వానంగా మారింది. పనులు పూర్తిచేయకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ఈ రహదారిపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లే సమయంలో తవ్విన ప్రాంతం కారణంగా జాగ్రత్తగా ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం గుంతలు, రాళ్ల మధ్య రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తవ్విన ప్రాంతం వద్ద అదుపు తప్పే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. గుంతలు, ఎగుడుదిగుడు రహదారి కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు, వాహనాలు దెబ్బతినే పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు తవ్వడంతో పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు బయటకు రావడంతో పలువురు వాటికి తగిలి కిందపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని, కొందరికి గాయాలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల



దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కార్యాలయాల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు అంటున్నారు. పైపులైన్ పనులు కొనసాగించాలనుకుంటే వాటిని పూర్తిచేయాలని, లేదంటే తవ్విన మట్టిని తొలగించి రోడ్డును యథావిధిగా పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన ఈ రహదారిపై అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థులు, వాహనదారులు, వృద్ధులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తవ్విన ప్రాంతంలో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి సురక్షితమైన రాకపోకలకు మార్గం కల్పించాలని కోరుతున్నారు. ప్రజల సమస్యను ఇకనైనా అధికారులు పట్టించుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని రాఘవేంద్ర కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్రిటికల్ కేర్ సెంటర్‌పై విష ప్రచారం మానుకోవాలి..

**చేతనైతే క్రిటికల్ కేర్ కేర్ సెంటర్‌ను పూర్తి చేయాలి**

**బీజేపీ నాయకులు**



నిర్మల్, అక్షిత ప్రతినిధి : వ్యక్తిగత విమర్శలు చేస్తే ఇంద్రకరణ్ రెడ్డికి ఇదే ఆసుపత్రిలో మానసిక చికిత్స ఇప్పిస్తాం: బీజేపీ నేతల ఘాటు వ్యాఖ్యలు

నిర్మల్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్రిటికల్ కేర్ సెంటర్‌పై మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారానికి దిగుతున్నారని మండిపడ్డారు.

కేంద్ర ప్రభుత్వం సుమారు ₹23.74 కోట్ల భారీ నిధులతో నిర్మల్‌కు ఈ అత్యాధునిక క్రిటికల్ కేర్ సెంటర్‌ను మంజూరు చేసింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ( బీజేఎల్పి లీడర్ ), స్థానిక శాసనసభ్యులు శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని ఈ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించారు.

అలాగే, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసిన ఘనత కూడా ఆయనదే.

ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. సుమారు ₹10 కోట్ల విలువైన వైద్య




పరికరాలు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలను సమకూర్చాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్క పరికరాన్ని కూడా అందుబాటులోకి తీసుకురాలేదు.

వెంటిలేటర్లు, అల్ట్రాసౌండ్ యంత్రాలు, మానిటర్లు, హారిజాంటల్ ఆటోక్లేవ్‌లు, డీఫిబ్రిలేటర్లు, మెకనైజ్డ్ లాండ్రీ, డైటరీ సేవలు, పారామానిటర్లు, ఏలీసా రీడర్–వాషర్ వంటి కీలక సదుపాయాలు ఇప్పటికీ లేవు. పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ పైప్‌లైన్లు కూడా ఏర్పాటు చేయలేదు. ల్యాబ్, ఎక్స్‌రే, ఫోలీ క్యాథెటర్ టెక్నీషియన్లను సైతం నియమించలేదు. కనీస వైద్య పరికరాలు, సదుపాయాలు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. ఈ లోపాలన్నింటినీ వెంటనే సరిచేసి క్రిటికల్ కేర్ సెంటర్‌ను పూర్తి చేయాలి.

ఆసుపత్రి ప్రారంభమైన వెంటనే ప్రజలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందాలన్నదే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లక్ష్యం. అందుకే అవసరమైన పరికరాలు, సిబ్బందిని కేటాయించాలని ఆయన పదేపదే ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రారంభోత్సవ తేదీని నిర్ణయించే అధికారం, అధికార యంత్రాంగం మొత్తం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయి. కేంద్రం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసి మిగిలిన పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే.

ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను చూసి తల తిరుగుతోందని, ఐసీయూ లో చేరాల్సి వస్తుందని ఇటీవల ఇంద్రకరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఇలాగే వ్యక్తిగత విమర్శలు కొనసాగిస్తే, ఇంద్రకరణ్ రెడ్డికి ఇదే ఆసుపత్రిలో మానసిక చికిత్స ఇప్పించే బాధ్యత కూడా తామే తీసుకుంటామని ఘాటుగా హెచ్చరించారు.

నిర్మల్ ప్రజలు ఇప్పటికే ఇంద్రకరణ్ రెడ్డిని రాజకీయంగా తిరస్కరించారని, మరోసారి ప్రజల్లోకి వచ్చినా ఆయనకు ఆదరణ లభించదని బీజేపీ నాయకులు వాఖ్యానించారు.

నలుగురిని వెంటబెట్టుకుని అసత్య ప్రచారం చేయడం మానుకుని, చేతనైతే క్రిటికల్ కేర్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరికరాలు, ఫర్నిచర్, సిబ్బందిని సమకూర్చి ఆసుపత్రిని యుద్ధప్రాతిపదికన ఫంక్షనింగ్‌లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిర్మల్ ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మే రాజు, సాదం అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్లు గంజి రాజు, నరేష్, విఠల్, జింక సురేందర్, సూరజ్ నాయక్, కూన శశాంక్, అర్జున్, ఈశ్వర్, మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, సర్పంచులు గంగారెడ్డి, సాహెబ్ రావు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీబీనగర్ ఎయిమ్స్‌లో పరిశుభ్రతకు కొత్త ప్రాధాన్యత

**రెండు నెలలుగా కఠిన పర్యవేక్షణ..**

**ఆసుపత్రి ప్రాంగణంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ**





యాదాద్రి భువనగిరి /అక్షిత బ్యూరో: ప్రతిరోజూ వేలాది మంది రోగులు, వారి సహాయకులు రాకపోకలు సాగించే ఎయిమ్స్ బీబీనగర్‌లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. గత రెండు నెలలుగా ఆసుపత్రి యాజమాన్యం చేపడుతున్న కఠిన పర్యవేక్షణ, నిబంధనల అమలు, నర్సింగ్ మరియు హౌస్‌కీపింగ్ సిబ్బంది చురుకైన భాగస్వామ్యంతో పరిశుభ్రతలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి.ఇటీవల ఆసుపత్రి అధికారులు రౌండ్లు, ప్రాంగణ తనిఖీలను మరింత పెంచారు. ఈ సందర్భంగా పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలను వెంటనే గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఓ పి డిలు, రోగులు వేచి ఉండే ప్రదేశాలు, టాయిలెట్లు, అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా హౌస్‌కీపింగ్ సిబ్బందికి నిరంతరం సూచనలు చేస్తున్నారు.అదేవిధంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, సందర్శకులు కూడా పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచిస్తున్నారు. చెత్తను నిర్దేశిత డస్ట్‌బిన్లలోనే వేయడం, ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త వేయకుండా ఉండడం, ఆసుపత్రి నిబంధనలను పాటించడం, ప్రభుత్వ ఆస్తులు మరియు ఆసుపత్రి సౌకర్యాలను జాగ్రత్తగా వినియోగించడం ద్వారా సహకరించాలని కోరుతున్నారు.ఆసుపత్రుల్లో పరిశుభ్రత కేవలం పరిసరాల అందం కోసం మాత్రమే కాకుండా, ఇన్ఫెక్షన్ల నియంత్రణకు, రోగులు, వారి సహాయకులు, వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బందికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు కీలకమైనదని అధికారులు పేర్కొంటున్నారు.ఆసుపత్రి యాజమాన్యం, నర్సింగ్, హౌస్‌కీపింగ్ సిబ్బంది, రోగులు, సందర్శకుల సమిష్టి సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతోందని తెలుస్తోంది. పరిశుభ్రతలో సాధించిన పురోగతిని కొనసాగించేందుకు నిరంతర పర్యవేక్షణ, తగిన వనరులు, సిబ్బంది సమన్వయం, ప్రజల చురుకైన భాగస్వామ్యం అవసరం.ఎయిమ్స్ బీబీనగర్‌లో పరిశుభ్రతను ఒకసారి చేపట్టే కార్యక్రమంగా కాకుండా, నాణ్యమైన వైద్య సేవలు, ఇన్ఫెక్షన్ నియంత్రణ, సమర్థవంతమైన ఆసుపత్రి నిర్వహణలో నిరంతర ప్రక్రియగా కొనసాగించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన సౌమ్యను అభినందించిన గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన వాటం శ్రీశైలం కుమార్తె సౌమ్యకు సిద్దిపేట జిల్లాలో ఎంబీబీఎస్ సీటు లభించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సౌమ్యను అభినందించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ సౌమ్య ఎంబిబిఎస్ విద్యను పూర్తి చేసేందుకు గాను ఆమె కు కావలసిన ఐదు సంవత్సరాల స్టడీ మెటీరియల్‌తో పాటు ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వట్టేపు బాలయ్య, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు రుక్కుద్దీన్, వార్డు మెంబర్ బచ్చలకూర మాణిక్యారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్ల సురేష్ గౌడ్,వర్కాల దేవయ్య,వాటం శ్రీశైలం,వాటం రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాతలకు ఘన సన్మానం

**అవార్డులను ప్రధానం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**



కరీంనగర్ అక్షిత బ్యూరో: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 30 మంది రక్తదాతలను ఘనంగా సన్మానించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అత్యవసర పరిస్థితులలో నిస్వార్థంగా ఎక్కువసార్లు రక్తదానం చేసిన దాతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా 'ఆసరా ప్రాణదాత – 2026' జిల్లాస్థాయి అవార్డులను ప్రధానం చేసి సత్కరించారు. రక్తదాతలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు, సమాజంలో ఆసరా ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గొల్లె తిరుపతి, సభ్యులు ఎం.రవిచందర్, ఎస్.నిఖిల్, పి.సంతోష్, ఎస్.అద్వైత్ తదితరులు పాల్గొన్నారు.

## రాయని గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ముఖ్యఅతిథిగా.జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాయని గూడెం సర్పంచ్.గుండు రామాంజిగౌడ్**



గరిడేపల్లి అక్షిత ప్రతినిధి: గరిడేపల్లి మండల పరిధిలోని రాయని గూడెం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం నాడు వైభవంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని అన్నారు. లబ్ధిదారులు ఇకపై ఈ కార్డుల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా రేషన్ సరుకులను పొందవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ ధ్యేయమని, గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో. గ్రామ పంచాయతీ కార్యదర్శి.వార్డు సభ్యులు. రేషన్ డీలర్లు. స్థానిక నాయకులు.మరియు గ్రామస్తులు. లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు సర్పంచ్‌కు మరియు ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ఎంపికలో పారదర్శకత ఏది?

### అసంపూర్తి ఇళ్లను హడావుడిగా కేటాయించడం సరికాదు

### కౌన్సిలర్ తిమ్మాజిపేట్ పాండు



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ పట్టణంలోని డబల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని నాగర్కర్నూల్ మున్సిపల్ కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాగర్కర్నూల్ పట్టణంలో సుమారు 90 శాతం పనులు పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు మిగిలిన పనులు పూర్తి చేయకుండా దాదాపు మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉంచారని ఆయన అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇప్పుడు హడావుడిగా 192 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇళ్ల పరిస్థితి చూస్తేనే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో అర్థమవుతుందని అన్నారు. అసంపూర్తి ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించడం వల్ల పేద ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని, లబ్ధిదారులే మిగిలిపోయిన పనులు చేసుకుంటే ప్రభుత్వం ఎందుకు, అధికారులు ఎందుకని ప్రశ్నించారు. 192 మంది లబ్ధిదారులను ఏ విధానం ప్రకారం ఎంపిక చేశారు? ఎవరు దరఖాస్తులను పరిశీలించారు? ఏ ప్రమాణాల ఆధారంగా అర్హత నిర్ణయించారు? అనే విషయాలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలు స్థానిక కౌన్సిలర్లకు, దరఖాస్తు చేసుకున్న ప్రజలకు కూడా పూర్తిగా తెలియకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసంకొంతమంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు లబ్ధిదారుల నుంచి రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులకు వేదికపై మాట్లాడే అవకాశం కల్పిస్తూ, ప్రజల తరఫున సమస్యలను ప్రశ్నించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకపోవడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రోటోకాల్ నిబంధనలు పాటించలేదనే ఆరోపణలపై కూడా అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు జేపీ చారి, కొత్త గంగాధర్, పాల్గొన్నారు..

## మత్తును బందు చేద్దాం - భవిష్యత్తును బాగు చేద్దాం

### సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ శ్రీకాంత్



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** జిల్లా కలెక్టర్ సమాచార పౌర సంబంధాల అధికారుల ఆదేశాల మేరకు నాగారం మండలం డి కొత్తపల్లి గ్రామంలో గంజాయి మాదక ద్రవ్యాల వాటి వినియోగాన్ని అరికట్టడానికి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఏర్పాటుచేసిన కళాజాత సమావేశంలో గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాలను జిల్లాలో నియంత్రిం చేందుకు ప్రత్యేక చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది. దీనికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం మాదకద్రవ్యాల వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయి మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలని. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే సొసైటీలో ఉనికి కోల్పోతారని సంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్, జిల్లా టీం లీడర్ గంట బిక్షపతి మాట్లాడినారు ప్రభుత్వ అందిస్తున్న సన్న బియ్యం పథకాలను ప్రజల చెంతకు చేరేలా కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు గడ్డం ఉదయ్, పల్లెల రాము, పల్లెల లక్ష్మణ్,పాక ఉపేందర్, మద్దిరాల మంజుల, కుందమల్ల నాగలక్ష్మి నాగలక్ష్మి, ములకలపల్లి మల్లమ్మ, నెమ్మది స్రవంతి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**నడిగూడెం, అక్షిత న్యూస్:** స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎన్. గీతాంజలి రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైంది. పీఎం శ్రీ లో భాగంగా సూర్యాపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలో ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి గీతాంజలి ని గురువారం అభినందించారు. ప్రతిభను చాటి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ సబ్జెక్టులలో విజ్ఞానాన్ని సంపాదించినప్పుడే క్విజ్ పోటీలలో రాణించవచ్చని అన్నారు. గైడ్ టీచర్ ఎం. వసంతను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చేర్యాల నూతన కమిషనర్గా అభిలాష్



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల మున్సిపల్ నూతన కమిషనర్ గా వి అభిలాష్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

## పర్యావరణం ద్వారానే ప్రజాహితం

### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్

### స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన బ్యాంకు సిబ్బంది




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతారని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు మేనేజర్లు, సిబ్బందితో కలిసి గురువారం స్థానిక సప్తగిరి కాలనీ లోయర్ మానేరు డ్యాం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా గుర్తించాలని ఆయన కోరారు. గాలి, నీరు, నేల మరియు జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమన్నారు. మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. "గ్రామీణ అభివృద్ధిలో టిజిబి పాత్ర" గ్రామీణ అభివృద్ధిలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముఖ్య భూమిక పోషిస్తున్నదని రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రజలు ముఖ్యంగా రైతులకు గ్రామీణ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 59 శాఖల ద్వారా బ్యాంక్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరులో తమ బ్యాంక్ పారదర్శకంగా పనిచేస్తుందని చెప్పారు. బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ (ఆపరేషన్స్) కందుల సుబ్బారావు, సీనియర్ బిజినెస్ మేనేజర్ కే. వంశీకృష్ణ, నోడల్ ఆఫీసర్ జి. మౌనిక, చీఫ్ మేనేజర్ జలంధర్ రెడ్డి, రమణారెడ్డి, మేనేజర్లు కొండపలకల వేణుమాధవ్, ఎం. ప్రవీణ్ రెడ్డి వివిధ బ్యాంక్ శాఖల మేనేజర్లు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మరియు రక్త దాన శిబిరం




**జగిత్యాల అక్షితబ్యూరో:** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల డిస్ట్రిక్ట్ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి వృద్ధాశ్రమం లో ఉచిత వైద్య శిబిరశీ నిర్వహించారు, ఈ శిబిరం జగిత్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ ఇనుగుర్తి రాజశేఖర్ దంతవైద్యులు, చెవి ముక్కు గొంతు వైద్యులు డాక్టర్ శ్రవణ్, మరియు కంటి వైద్యులు రఘురాం లు పాల్గొని వృద్ధులకు రక్త మరియు షుగర్ పరీక్షలు, ఈసీజీ, కంటిచూపు చెవి ముక్కు గొంతు సమస్యలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు, తదనంతరం వారికి రోజు వారి ఉపయోగ పడే నిత్యవసర వస్తువులు అందజేయడం జరిగిందిలి,

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల డిస్ట్రిక్ట్ చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ భీమానాతిని ఉమా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ సిరిసిల్ల శ్రీనివాస్, రెడ్ క్రాస్ సోసైటీ కమిటీ మెంబర్స్ చిత్తారి మధుకర్, సిరిపురం శ్రీనివాస్, గుండ సురేష్, శివ గాయత్రి వృద్ధుల ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారులి,

తదనంతరం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ సందర్భంగా జగిత్యాల సివిల్ హాస్పిటల్ లోని బ్లడ్ బ్యాంకులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం చేయడం జరిగిందిలి

లిఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తశీ ఇవ్వడం అనేది ప్రతి 3 నెలలకు ఒకసారి ఇవ్వవచ్చు అని ప్రజలలో ఇంకా అవగాహన రావాలని, ఆపద సమయంలో రక్తశీ దొరకక ఇబ్బంది పడే సందర్భాలు ఎన్నో ఉన్నాయని దాతలు ముందుకు వచ్చి రక్తం ఇవ్వాలని చెప్పడం జరిగిందిలి,

లిఈ కార్యక్రమంలో వైద్యులు మరియు, రెడ్ క్రాస్ చైర్మన్ మరియు సభ్యులు అలాగే బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారులి